నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, బుధవారం 7 ఆగస్టు 2024 | SURYAPET

ఎర్త్ డ్యామ్ వద్దకు లాంచీ స్టేషన్

నందికొండ, ఆగస్టు 6 : నందికొండ హిల్‌కాలనీ విజయవిహార్ వెనుక భాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన లాంచీ స్టేషన్‌ను గతంలో ఎర్త్ డ్యామ్ సమీపంలో నిర్వహించిన స్థలానికి మార్చినట్లు లాంచీస్టేషన్ అధికారులు తెలిపారు. ఇప్పటి నుంచి లాంచీలు ఎర్త్ డ్యామ్ సమీపంలోని లాంచీస్టేషన్ నుంచి నాగార్జునకొండకు జాలీ ట్రిప్పులు నడుపుతామని, కృష్ణానదిలో 560 అడుగులు వరకు నీరు ఉన్నంత వరకు ఇక్కడి నుంచి లాంచీలను నడుపవచ్చని చెప్పారు.


ఎర్త్ డ్యామ్ వద్ద లాంచీలు

22 గేట్లు ఖుల్లా

క్రస్ట్ గేట్ల ద్వారా కొనసాగుతున్న సాగర్ నీటి విడుదల

- ఇన్‌ఫ్లో 3,1,5010, అవుట్‌ఫ్లో 3,55,079 క్యూసెక్కులు
- డ్యామ్ పరిసరాల్లో పర్యాటకుల సందడి

నందికొండ, ఆగస్టు 6 : కృష్ణానది జోరుగా నాగార్జునసాగర్ రిజర్వాయర్ పూర్తి స్థాయికి చేరుకోవడంతో సోమవారం డ్యామ్ క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదలను ప్రారంభించగా మంగళవారం కూడా కొనసాగింది. రిజర్వాయర్ నీటి మట్టం 585.20 (298.01 టీఎంసీలు) అడుగులకు చేరగానే డ్యామ్ క్రస్ట్ గేట్ల సంఖ్యను 16 నుంచి 20కు పెంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం 10 గంటల వరకు 20 క్రస్ట్ గేట్లు (4 గేట్లు 5 అడుగులు, 16 గేట్లు 10 అడుగులు) ఎత్తి 3,00,995 క్యూసెక్కులు నీటిని దిగువగు విడుదల చేశారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో పెరుగడంతో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి వరకు 22 క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 3,08,770 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న కృష్ణా డెల్టాకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి క్రస్ట్ గేట్ల ద్వారా 3,08,770 , ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎడమ కాల్వ ద్వారా 8,022, కుడి కాల్వ ద్వారా 8,067, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 2,8,420 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు మొత్తం ఇన్‌ఫ్లో 3,1,5010, అవుట్‌ఫ్లో 3,55,079 క్యూసెక్కులు కొనసాగుతున్నది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులకు ప్రస్తుతం 883.10 అడుగులు ఉంది.

ఎడమ కాల్వకు 8 వేల క్యూసెక్కులు

ఆగస్టు 2 నుంచి సాగర్ ఎడమ కాల్వకు 4 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యామ్‌కు వరద పోటెత్తడంతో ఎడమ కాల్వ నీటి విడుదలను క్రమంగా 8 వేల క్యూసెక్కులకు పెంచారు. ఇంకా నీటి విడుదలను పెంచే అవకాశం ఉందని ఎన్నెస్పీ అధికారులు తెలిపారు.

పర్యాటకుల సందడి

సాగర్ డ్యామ్‌పై నుంచి పాల పొంగుతో జాలువారుతున్న కృష్ణమ్మ అందాలను వీక్షించడానికి పర్యాటకులు భారీగా తరలివచ్చారు. డ్యామ్ పరిసరాల్లో ఫొటోలు, సెల్ఫీలు దిగారు. చేపల ఫ్రై, తినుబండారాలు, ఐస్‌క్రీమ్స్ తింటూ సరదాగా గడిపారు.

నాగార్జునసాగర్ 22 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

పులిచింతలలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం

3 యూనిట్లతో 60 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన

చింతలపాలెం, ఆగస్టు 6 : నాగార్జునసాగర్ క్రస్ట్ గేట్లు ఎత్తడంతో పులిచింతలకు వరద పోటెత్తుండడంతో ప్రాజెక్టు దిగువన నిర్మించిన తెలంగాణ జెన్కోలో విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని మంగళవారం ప్రారంభించారు. జెన్కోలో 4 యూనిట్లతో విద్యుత్ ఉత్పాదనకు అవకాశం ఉండగా ప్రస్తుతం 10,0 00 క్యూసెక్కుల నీటితో మూడు యూనిట్లు రన్ చేస్తూ 60 మెగావాట్లను ఉత్పత్తి చేస్తున్నట్లు ఎస్ఈ దేశ్యా నాయక్ తెలిపారు. మరొక యూనిట్ ట్రయల్ రన్‌లో ఉన్నట్లు చెప్పారు. ప్రస్తుతం సాగర్ నుంచి 3,95,056 క్యూసెక్కుల వరద పులిచింతల ప్రాజెక్టుకు చేరుతుండగా, అధికారులు ప్రాజెక్టు 9 క్రస్ట్ గేట్లను ఎత్తి 1,70,326 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వరద ఉధృతిని బట్టి మరికొన్ని గేట్లు తెరవడంతోపాటు విద్యుత్ ఉత్పత్తిని పెంచే అవకాశం ఉంది. పులిచింతల నీటి సామర్థ్యం 175(45.77 టీఎంసీలు) అడుగులకు గానూ ప్రస్తుతం 160(21.94 టీఎంసీలు) అడుగులకు నీటి మట్టం చేరింది.


నల్లగొండలో జయశంకర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, కంచర్ల భూపాల్‌రెడ్డి తదితరులు

ఉద్యమానికి ఊపిరిలూదిన మహనీయుడు జయశంకర్ సార్

- ప్రొఫెసర్ యాదిలో జయంతి
- నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యేలు, మాజీ జడ్పీ చైర్మన్

రామగిరి, ఆగస్టు 6: తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఊపిరిలూదిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని మాజీ జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. జయశంకర్ సార్ జయంతి సందర్భంగా మంగళవారం నల్లగొండ పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జయశంకర్ సార్ ఉద్యమ నాయకుడు కేసీఆర్‌కు చేదోడుగా ఉంటూ ఎంతోమందిలో ఉద్యమ స్ఫూర్తిని కలిగించారని గుర్తు చేశారు. బతికి ఉంటే కేసీఆర్ పాలనలో తెలంగాణలో జరిగిన అభివృద్ధిని చూసి ఎంతో సంతోషించే వారన్నారు. అలాంటి తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అరాచక పాలన సాగిస్తున్నదని, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకుండా సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనలు చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణకు అన్యాయం జరిగే సందర్భం ఏదైనా జయశంకర్ సార్ ఇచ్చిన స్ఫూర్తితో ప్రతిఒక్కరూ ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్‌వలీ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చీర పంకజ్‌యాదవ్, మాజీ ఆర్వో మాలె శరణ్యా రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మాజీ ఎంపీపీ కరీంపాషా, మాజీ జడ్పీటీసీ తండు సైదులు గౌడ్, నాయకులు సింగం రామ్మోహన్, బక్క పిచ్చయ్య, కాంచనపల్లి రవీందర్‌రావు, న్యాయవాది జవహర్‌లాల్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బోనగిరి దేవేందర్, సింగం లక్ష్మి, తిప్పర్తి , కనగల్ మండలాల అధ్యక్షులు పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, అయితగోని యాదయ్య, నాయకులు కొండూరి సత్యనారాయణ, మారగోని గణేశ్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, బొమ్మరబోయిన నాగార్జున, పోనుగోని జనార్దన్‌రావు, పేల్ల అశోక్‌రెడ్డి, జమాల్‌ఖాద్రి, మాతంగి అమర్, షబ్బీర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

గద్దర్‌కు నివాళి

ప్రజా యుద్ధనౌక గద్దర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా నల్లగొండలో మాజీ జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షుడు పందుల సైదులు ఆధ్వర్యంలో జయశంకర్‌సార్, గద్దర్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. సామాజిక ప్రజా సంఘాల నేతలు మానుపాటి భిక్షమయ్య, డోలుదెబ్బ మాలిగ యాదయ్య, నర్సింగ్ హర్షవర్ధన్, రఘు, హరి పాల్గొన్నారు.

పేదలందరికీ ఇండ్లు ఇస్తాం

- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్, ఆగస్టు 6 : రాష్ట్రంలోని నిరు పేదలకు ఇండ్లను అందజేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్‌లో మంగళవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. పట్టణంలోని రామస్వామి గుట్ట వద్ద నిర్మింస్తున్న సింగిల్ బెడ్రూం ఇందిరమ్మ ఇండ్లను కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి రోల్ మోడల్‌గా హుజూర్‌నగర్‌లో 2,160 సింగిల్ బెడ్రూం ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తున్నామన్నారు. రానున్న మూడునెలల్లో ఇండ్లను అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ పథకం కింద ఒక్కో నియోజకవర్గంలో 3,500 ఇండ్ల చొప్పున రూ.22 వేల కోట్లతో రాష్ట్రంలో 4.5 లక్షల ఇండ్లను నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నదని చెప్పారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) వంటి కేంద్ర గృహ నిర్మాణ పథకాల్లో ఎన్డీయే ప్రభుత్వం తెలంగాణను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. అనంతరం స్థానిక క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 325 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంత్రి ఉత్తమ్ పంపిణీ చేశారు. ఆ తర్వాత హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రి భవన నిర్మాణం, క్రిస్టియన్ శ్మశాన వాటిక , టౌన్ హాల్ పనులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్టేడియం ఏర్పాటుకు అనుమైన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఐటీఐ కళాశాల ఏటీసీ సెంటర్, ఎన్‌జీఓ కాలనీలో టీయూఎఫ్‌డీసీ పనులకు శంకుస్థాపన చేశారు. షెడ్యూల్డ్ కులాల వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పురస్కరించుకొని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నిర్వహించిన ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, తాసీల్దార్లు మంగ, కవిత, శ్రీదేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

రోడ్లపై మురుగు పారొద్దు

- వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ సి.నారాయణరెడ్డి

నల్లగొండ రూరల్, ఆగస్టు 6 : రోడ్లపై మురుగు నీరు ప్రవహించకుండా సోక్ ఫిట్ల నిర్మాణాన్ని చేపట్టాలని, ఇంకుడు గుంతలు నిర్మించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన నల్లగొండ మండలంలోని గుట్టకింది అన్నారం గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించారు. గ్రామం అంతా కలియ తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. అక్కడక్కడ వర్షపు నీరు నిలిచి ఉండడాన్ని గమనించి తక్షణమే మొరం లేదా మట్టి వేయించాలని ఇన్‌చార్జి అధికారి, మిషన్ భగీరథ ఏఈ షఫీయొద్దీన్ ఆదేశించారు. దోమలు వ్యాప్తి చెందకుండా స్ప్రే చేయించాలని, సురక్షిత తాగు నీరు అందించాలని సూచించారు. పాఠశాల పక్కన పెంటకుప్ప ఉండడాన్ని గమనించి సంబంధిత వ్యక్తిని పిలిపించి వారం రోజుల్లో తీసివేయాలని చెప్పారు. ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులతో మట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పిల్లల సంఖ్య, ఆహారం వివరాలు, గర్భిణులు, బాలింతలు ఇస్తున్న పౌష్టికాహారం వివరాలు తెలుసుకున్నారు. అనంతరం గొల్లగూడ –2 ఫారెస్ట్‌లో అర్బన్ పార్కును పరిశీలించారు. గ్రామానికి బస్సు సౌకర్యం సైతం కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. ఆయన వెంట నల్లగొండ ఆర్డీఓ రవి, ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి, తాసీల్దార్ శ్రీనివాస్, ఆటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి వి.సుధాకర్‌రెడ్డి, ఎంపీఓ మూజిబ్, ఏఓ శ్రీనివాస్, ఏపీఎం వినోద, ఏఈఓ మౌనిక, పంచాయతీ కార్యదర్శి సాయిచరణ్, యశ్వంత్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

జీకే అన్నారంలో మురుగును పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి


మరమ్మతులకు నోచుకోని ఏఎమ్మార్పీ మోటార్లు

మొరాయిస్తున్న మోటార్లు

ఏఎమ్మార్పీలో నాలుగు మోటార్లకు నడిచేది మూడే

- సాగర్‌లో నీళ్లున్నా పూర్తిగా తీసుకోలేని దుస్థితి
- మూడు రోజుల్లో రెండు సార్లు నిలిచిన మూడో యూనిట్
- మరమ్మతులకే పరిమితమైన మొదటి యూనిట్
- ముందస్తు ప్రణాళికలేక ఎండిపోయిన ఏకేబీఆర్

పెద్దఅడిశర్లపల్లి, ఆగస్టు 6 : మొన్నటి వరకు సాగర్‌లో సరిపడా నీళ్లు లేకపోవడంతో ఒకటి రెండు మోటార్ల ద్వారా తాగునీటి అవసరాలకు మాత్రమే ఏఎమ్మార్పీ నీటిని వినియోగించారు. మరింత నీటి మట్టం తగ్గడంతో అత్యవసర మోటార్ల మీద ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఎగువన కురిసిన వర్షాలకు సాగర్‌కు భారీ వరద వచ్చి చేరడంతో పూర్తి స్థాయి నీటి మట్టం పెరిగింది. కానీ అధికారుల ముందస్తు వ్యూహం లేకపోవడంతో నేడు ఏఎమ్మార్పీ ఆయకట్టు ఎండిపోయే పరిస్థితి దాపురించింది. లక్షల క్యూసెక్కులు సాగర నుంచి వృథాగా పోతున్నా ఏఎమ్మార్పీ నుంచి నాలుగు మోటార్ల ద్వారా 2,400 క్యూసెక్కులు తీసుకోలేకపోతున్నాం. నీటి విడుదల కోసం ఏఎమ్మార్పీ నుంచి మూడు మోటార్ల ద్వారా 1,800 క్యూసెక్కులు విడుదల చేసినా అవికూడా పూర్తి స్థాయిలో వినియోగించుకోలేని దుస్థితి. ప్రధాన కాల్వతో పాటు అన్ని డిస్ట్రిబ్యూటరీలకు నీటిని విడుదల చేయాలని అధికారులు సిద్ధం కాగా ఐదు రోజుల క్రితం ఏఎమ్మార్పీ మూడో యూనిట్ రన్ చేశారు. కానీ సాంకేతిక సమస్యలతో కూలింగ్ పైపులైన్ల ద్వారా నీళ్లు లీకు కావడంతో రెండు మోటార్లను మాత్రమే నడుపాల్సి వస్తున్నది. నాలుగు మోటార్ల ద్వారా 2,400 క్యూసెక్కులు విడుదల చేసే ఏకేబీఆర్ మొదటి యూనిట్ మరమ్మతులకు గురి కావడంతో పూర్తిగా నిలిచిపోయింది.

ఎండిన ఏకేబీఆర్

తాగునీటి అవసరాలకు కోసం ఏకేబీఆర్ నుంచి నీటి విడుదల చేయడంతో నీటి మట్టం గణనీయంగా తగ్గింది. దాంతో ప్రస్తుతం విడుదల చేస్తున్న నీళ్లు ఏకేబీఆర్ నిండడానికి కూడా సరిపోవడంలేదు. సాగర్ గేట్ల ద్వారా లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా పోతున్న ఏఎమ్మార్పీ ఆయకట్టు పరిధిలోని అన్ని డిస్ట్రిబ్యూటరీలకు పూర్తి స్థాయిలో నీటి విడుదల కొనసాగడం లేదు. దాంతో ప్రధాన కాల్వకు దాదాపు 1,500 క్యూసెక్కులకు పైగా నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నా మూడు మోటార్లు సక్రమంగా నడవకపోవడం, ఏకేబీఆర్ నీటి మట్టం తక్కువ ఉండడంతో కేవలం 850 క్యూసెక్కులే విడుదల చేస్తున్నారు. గతంలో అధికారులు ముందస్తుగా ఏకేబీఆర్ పూర్తి స్థాయిలో నింపుకునే ఉంటే ప్రస్తుతం విడుదల అవుతున్న నీళ్లు జంటనగరాలకు తాగునీటితోపాటు ఏఎమ్మార్పీ ఆయకట్టు, ప్రాజెక్టు పరిధిలోని చెరువుల నింపుకునే అవకాశం ఉండేది. ప్రస్తుతం విడుదల అవుతున్న నీరు ఏకేబీఆర్ పరిధిలోని డిస్ట్రిబ్యూటరీలతోపాటు లింక్ కెనాల్‌పై మోటార్ల ద్వారా కొంత వ్యవసాయానికి వినియోగించడంతో ఏకేబీఆర్‌లోకి 1,800 క్యూసెక్కులు చేరడం లేదు. ఏకేబీఆర్ నీటి మట్టం 245 ఎఫ్ఆర్ఎల్‌కుగానూ కేవలం 241.5 ఎఫ్ఆర్ఎల్ ఉంది. దీంతో ఏకేబీఆర్ నీటిమట్టం పెంచాలంటే ప్రధాన కాల్వకు మూడు రోజులపాటు పూర్తి నీటిని నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం రైతులు వరి నాట్లు వేస్తున్న తరుణంలో ప్రధాన కాల్వకు నీటి నిలుపుల చేయలేక, ఏకేబీఆర్ నింపలేక అధికారులు తల పట్టుకుంటున్నారు.

మరమ్మతుల్లో మొదటి యూనిట్

ఏఎమ్మార్పీ మొదటి యూనిట్ క్యాపిటల్ ఓరాలింగ్‌లో భాగంగా రెండు నెలులుగా నడుపడం లేదు. దాంతో మూడు ఏఎమ్మార్పీ మూడు మోటార్లపైనే ఆధారపడాల్సి వస్తున్నది. గతంలో సాగర్ నీటి మట్టం తక్కువ ఉన్నా వేసవిలోనే ఓరాలింగ్ పూర్తి చేస్తే సాగర్‌కు వరదలు వచ్చే నాటికి మొదటి యూనిట్ వినియోగంలోకి వచ్చేది. కానీ ప్రస్తుతం సాగర్ నిండుగా ఉన్న మొదటి యూనిట్ నడుపలేని పరిస్థితి దాపురించింది. గతంలో యూనిట్ మరమ్మతుల టెండర్ల జాప్యంతో సకాలంలో పనులు పూర్తి కావడంలేదని తెలుస్తున్నది. సాగర్‌లో పూర్తి స్థాయిలో నీళ్లు ఉన్నప్పటికీ ముందస్తు ప్రణాళిక లేక నేడు ఏఎమ్మార్పీ ఆయకట్టుకు నీటిని విడుదల చేయలేక పోతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

నిరంతర నీటి విడుదలతో మోటార్లకు మరమ్మతులు చేయలేకపోతున్నాం

ప్రస్తుతం ఏఎమ్మార్పీ మోటార్లు నిరంతరం నడుపడంతో పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయలేకపోతున్నాం. రెండు రోజుల క్రితం మూడో యూనిట్ నిలిచిపోవడంతో తక్షణమే మరమ్మతులు చేశాం. ప్రస్తుతం మూడు యూనిట్ల ద్వారా 1800 క్యూసెక్కులు విడుదల చేస్తున్నాం. రెండు మాసాలుగా క్యాపిటల్ ఓరాలింగ్ జరుగుతున్నందున మొదటి యూనిట్ పనిచేయడం లేదు. వేగవంతంగా పనులు పూర్తి చేసి త్వరలో మొదటి యూనిట్‌ను వినియోగంలోకి తీసుకొస్తాం.

-ఏడీఈ సుధాకర్

సూర్యాపేట డీఐఈఓగా భానూనాయక్

సూర్యాపేట అర్బన్, ఆగస్టు 6 : జిల్లా ఇంటర్మీడియట్ అధికారిగా నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భానునాయక్‌ను నియమిస్తూ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు పని చేసిన హుజూర్‌నగర్ ప్రిన్సిపాల్ జానపాటి కృష్ణయ్య కంటే భానునాయక్ సీనియర్ కావడంతో ఆయనను నియమించారు. భానునాయక్ ఇటీవల నల్లగొండ జిల్లా చింతపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీపై వచ్చారు.

బాధ్యతలు చేపట్టిన భానునాయక్